క్లుప్తంగా

పీడీసీసీబీ చైర్మన్ ప్రసాద్‌రెడ్డికి అభినందనలు



పీడీసీసీబీ చైర్మన్ ప్రసాద్‌రెడ్డిని సన్మానిస్తున్న రంగసాయిరెడ్డి

ఒంగోలు సిటీ: ఆంధ్రకేసరి యూనివర్సిటీ డీన్, ఎన్.ఎస్ లా కళాశాల ప్రిన్సిపాల్ మదిరె రంగసాయిరెడ్డి జిల్లా సహకార కేంద్ర బ్యాంకు కార్యాలయంలో పీడీసీసీబీ చైర్మన్ వై.ఎం.ప్రసాద్‌రెడ్డి (బన్నీ)ని బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపి సన్మానించారు. సమాచార హక్కు చట్టంకు సంబంధించి ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కోరుతూ న్యాయపరమైన అంశాలపై చర్చించారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ కేఎస్

ఒంగోలు టౌన్: అధ్యయనం, పోరాటం నినాదంతో ఏర్పాటైన భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) 45వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పిలుపునిచ్చారు. బుధవారం ఎల్బీజీ భవనంలో కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. డిసెంబర్ 12, 13 తేదీల్లో ఒంగోలులో నిర్వహించనున్న జిల్లా మహాసభలలో భవిష్యత్తు కర్తవ్యాలను రూపొందించుకోనున్నట్లు ఆ సంస్థ జిల్లా కార్యదర్శి సీహెచ్ వినోద్ తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థి, యువజన నాయకులు కేఎఫ్ బాబు, టీ ప్రవీణ్‌కుమార్, వీరాస్వామి, వెంకటేష్, విజయ్, బాజీ తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ మిషన్‌పై అవగాహన కార్యక్రమం

అల్లూరు (కొత్తపట్నం): విక్షిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా అల్లూరు పొలాల్లో డ్రోన్ మిషన్‌పై రైతులకు బుధవారం అవగాహన కల్పించారు. డ్రోన్ తీసుకెళ్లి మందు పిచికారీ చేసే విధానాన్ని వివరించారు. ఏవో మోహన్‌రెడ్డి మాట్లాడుతూ డ్రోన్ మిషన్ ద్వారా పైర్లకు సులభంగా మందు పిచికారీ చేసుకోవచ్చన్నారు. డ్రోన్ ఖరీదు రూ.6 లక్షలని, పది లీటర్ల ట్యాంక్ ఉంటుందని, ఒకేసారి ఒక ఎకరాకు పిచికారీ చేసుకోవచ్చని అన్నారు. ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత, ఈవోఆర్డీ ఏ బాలచెన్నయ్య, చంద్రశేఖర్, ఎంఈవో పద్మావతి, తోటారెడ్డి, నాగలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

జనరిక్ మందులపై ప్రజలకు అవగాహన కల్పించాలి



జనరిక్ మెడికల్ షాపును తనిఖీ చేస్తున్న సుమన్

ఒంగోలు టౌన్: తక్కువ ధరకు లభించే జనరిక్ మందుల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని డాక్టర్ వైఎస్సార్ సంజీవని రాష్ట్ర అధ్యక్షుడు డా.సింగనమల సుమన్ జనరిక్ మెడికల్ షాపుల నిర్వాహకులకు సూచించారు. బుధవారం నగరంలోని జనరిక్ మెడికల్ షాపులను ఆయన తనిఖీ చేశారు. నిబంధనల మేరకు మందులను తక్కువ ధరలకు విక్రయిస్తున్నారా.. లేదా..? అని రికార్డులు పరిశీలించారు. సీఎం జగన్ ఆశయాల మేరకు నిరుపేదలకు తక్కువ ధరకు ఔషధాలు అందజేయాలన్న ఉద్దేశంతో రాష్ట్ర వ్యాప్తంగా 85 జనరిక్ మెడికల్ షాపులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లా కేంద్రమైన ఒంగోలు నగరంలో ఆర్టీసీ బస్టాండు సమీపంలో మూడు జనరిక్ మెడికల్ షాపులు, కర్నూలు రోడ్డులో ఒకటి కలిపి మొత్తం నాలుగు మెడికల్ షాపులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

రహదారి భద్రత నిబంధనలు పాటించాలి

ఒంగోలు: ఆటో రిక్షా యజమానులు, డ్రైవర్లు రహదారి భద్రత నిబంధనలు తప్పక పాటించాలని ప్రకాశం జిల్లా రవాణాశాఖ ఉప కమిషనర్ ఆర్.సుశీల ఆదేశించారు. రహదారి భద్రత, ప్రమాదాల నివారణకు కలెక్టర్ ఆదేశాల మేరకు వాహనదారులను అప్రమత్తం చేసే కార్యక్రమంలో భాగంగా ఈ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా తమ అధికారులు, సిబ్బంది బుధవారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఆటో రిక్షాల యజమానులు, డ్రైవర్లు, ఈ-రిక్షాల యజమానులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంవీఐలు, రోడ్డు సేఫ్టీ ఎస్సై తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అధికారిని నియమించాలని విజ్ఞప్తి

ఒంగోలు: ఏపీ టైలర్స్ ఫెడరేషన్‌కు ప్రత్యేక అధికారిని నియమించాలని ఏపీ ప్రైమరీ టైలర్స్ కోఆపరేటివ్ సొసైటీ ప్రతినిధులు షేక్ అమర్‌జాన్, జి.వెంకట సుబ్బారావు, పి.మల్లికార్జున్, ఎస్.శ్రీనివాసులు, ఎస్‌కే నాగూర్ తదితరులు ఏపీ ప్రభుత్వ చేనేత జౌళి పరిశ్రమల విభాగం ముఖ్య కార్యదర్శి సునీతను కలిసి విజ్ఞప్తి చేశారు. 2021 ఆగస్టు 2న ప్రభుత్వం చైర్మన్‌ను నియమించడం జరిగిందని, పదవీ కాలం పూర్తయిన దృష్ట్యా టైలర్స్ ఫెడరేషన్ ఇంప్లిమెంట్ చేసేందుకు బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు.



ఒంగోలులో పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న మేయర్ గంగాడ సుజాత



దొడ్డవరప్పాడు సచివాలయంలో పథకాల లబ్ధి పట్టికను ఆవిష్కరిస్తున్న నాయకులు

పథకాలు కొనసాగాలంటే జగన్ తప్పనిసరి

- ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత

ఒంగోలు సబర్బన్: ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రానికి ఎక్కువ కాలం కొనసాగాలని ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత ఆకాంక్షించారు. నగరంలోని 35వ డివిజన్‌లో బుధవారం 'ఏపీకి జగనే ఎందుకు కావాలి' అనే కార్యక్రమం నిర్వహించారు. డివిజన్ కార్పొరేటర్ ఆదిపూడి గిరిజా శంకర్ శాండిల్య అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ సంక్షేమ సారథిగా దేశంలో ఏ ముఖ్యమంత్రి అందించనంతగా పేద, బడుగు, బలహీన వర్గాలకు సీఎం జగన్ ఆర్థిక సాయాన్ని నేరుగా వారి బ్యాంకు అకౌంట్లకు పంపడం చరిత్రలో నిలిచిపోతుందని కొనియాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అగ్రవర్ణ పేదలను గుర్తించి మరీ ఇంటికి పెద్ద కుమారునిగా ఆదుకోవడం ఇప్పటి వరకు ఏ ముఖ్యమంత్రికీ సాధ్యం కాలేదన్నారు. రాష్ట్రం సమగ్ర అభివృద్ధి దిశగా అడుగులు ముందుకు వేయాలంటే ఎక్కువ కాలం రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సేవలు ఎంతో అవసరమన్నారు. విద్య, వైద్య రంగాల్లో సంచలన మార్పులు తీసుకొచ్చిన అతి చిన్న వయస్సు ముఖ్యమంత్రిగా దేశ చరిత్రలో నిలిచిపోతారన్నారు. ఈ సందర్భంగా 35వ డివిజన్‌లో సంక్షేమ, అభివృద్ధికి సంబంధించి ఇప్పటి వరకు ప్రభుత్వం ఎంత ఖర్చు చేసిందనే లెక్కలతో కూడిన బోర్డును మేయర్ ఆవిష్కరించారు. అనంతరం డివిజన్‌లో ఇంటింటికి తిరిగి రాష్ట్రానికి జగన్ ఎందుకు అవసరమో వివరించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ అధికారులతో పాటు వైఎస్సార్ సీపీ నాయకులు, పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు ఘంటా రామానాయుడు, వలంటీర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రి కావాలి

మద్దిపాడు: జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రి కావాలని మద్దిపాడు ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి అన్నారు. మండలంలోని దొడ్డవరప్పాడు గ్రామంలో బుధవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీపీ మాట్లాడుతూ పెన్షన్లు 1వ తేదీ ఉదయమే ఇంటికి వలంటీర్ల ద్వారా సీఎం చేరుస్తున్నారని, అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి పార్టీ, కుల, మత భేదం లేకుండా పథకాలు అందిస్తున్నారని కొనియాడారు. గ్రామాల్లో సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి పరిపాలనను గ్రామ స్థాయికి తీసుకొచ్చారని తెలిపారు. అందుకే జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మండవ అప్పారావు, వైస్ ఎంపీపీ పైడిపాటి వెంకట్రావు, బొమ్మల రామాంజనేయులు, గ్రామ సర్పంచ్, జిల్లా సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు బెజవాడ శ్రీరాములు ఉరఫ్ రాము, పలువురు లబ్ధిదారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

గాడిపర్తివారిపాలెంలో...

చీమకుర్తి: మండలంలోని గాడిపర్తివారిపాలెం సచివాలయం పరిధిలో బుధవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు పాల్గొని లబ్ధిదారులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. వచ్చే ఎన్నికల్లోనూ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, జేసీఎస్ కన్వీనర్ చిన్నపురెడ్డి మస్తాన్‌రెడ్డి, సర్పంచ్ అయ్యవారయ్య, సూడిదేల సుబ్బరామిరెడ్డి, స్థానికులు పాల్గొన్నారు.

పేర్నమిట్టలో...

పేర్నమిట్టలోని ఒంగోలు 40వ డివిజన్‌లో ఇందిరా నగర్ పరిధిలో కార్పొరేటర్ తేళ్ల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో బుధవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. 40వ డివిజన్‌లో రూ.2 కోట్లతో అభివృద్ధి పనులు చేసినట్లు వివరించారు. స్థానిక సచివాలయ సిబ్బంది, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

యరజర్లలో...

ఒంగోలు రూరల్: మండలంలోని యరజర్ల సచివాలయ ప్రాంగణంలో బుధవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక సర్పంచ్ తమ్మిశెట్టి రాములమ్మ అధ్యక్షత వహించగా ఒంగోలు ఎంపీపీ పల్లపోలు మల్లికార్జునరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దశాబ్దాలుగా రాష్ట్రంలో పీడిస్తున్న ఇళ్ల పట్టాల సమస్యను సీఎం జగన్ పరిష్కరించారని కొనియాడారు. మౌలిక వసతులతో కూడిన గృహాలను పేదలకు సమకూర్చారన్నారు. సచివాలయ వ్యవస్థను నెలకొల్పి లక్షా నలభై వేలకుపైగా ఉద్యోగాలివ్వడం గొప్ప విషయమన్నారు. 50 గృహాలకు ఒక వలంటీర్ నియామకం ద్వారా ఇంటికే ప్రభుత్వ పథకాలు అందించడం పేదలకు వరంగా మారిందన్నారు. ప్రతి గ్రామంలో రైతు భరోసా, సచివాలయ భవనం, హెల్త్ సెంటర్లు నిర్మించడం ద్వారా అధికారులే గ్రామాల్లో పనిచేసేందుకు, గ్రామస్థాయిలోనే ప్రజల సమస్యలు పరిష్కారమయ్యేందుకు మార్గం చూపారన్నారు. ఈవోఆర్డీ మారెడ్డి రమణమ్మ, వైఎస్సార్ సీపీ నాయకుడు తమ్మిశెట్టి శ్రీనివాసులు, సచివాలయ కన్వీనర్ సోమశేఖర్, మాజీ ఎంపీటీసీ జాజుల శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు. అనంతరం యరజర్లలో అభివృద్ధి పథకాల ఫ్లెక్సీని ఎంపీటీసీ ఆవిష్కరించగా, తొలుత వైఎస్సార్ సీపీ జెండాను ఎంపీపీ ఆవిష్కరించారు.

మోటుమాలలో...

మోటుమాల (కొత్తపట్నం): సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలు చేసి అందరూ సుఖసంతోషాలతో ఉన్నందుకే మళ్లీ సీఎంగా జగనే కావాలని ప్రజలు కోరుకుంటున్నారని మోటుమాల సర్పంచ్ కోడూరి గోపి అన్నారు. గ్రామంలో బుధవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా సచివాలయం పరిధిలో రూ.23.02 కోట్లతో సంక్షేమ, అభివృద్ధి పథకాల బోర్డును గోపి చేతుల మీదుగా ఆవిష్కరించారు. గోపి మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుంచి వెంటాడుతున్న భూ సమస్యను అసైన్‌మెంట్ కమిటీ పెట్టి పట్టాలివ్వడం ద్వారా సీఎం పరిష్కరించడం గర్వించదగిన విషయమన్నారు. గ్రామానికి నాలుగున్నర సంవత్సరాలలో సంక్షేమ, అభివృద్ధి పథకాల ద్వారా రూ.23.02 కోట్ల నగదు ఖర్చు చేశారని, అందుకే జగనన్నే మళ్లీ సీఎం కావాలని జనం కోరుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ కోడూరి వెంకటరెడ్డి, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి, వీవోఏలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



గాడిపర్తివారిపాలెం సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తున్న ఎంపీపీ శ్రీనివాసరావు



ఒంగోలు 40వ డివిజన్‌లో మాట్లాడుతున్న కార్పొరేటర్ చంద్రశేఖర్



యరజర్లలో పథకాల ఫ్లెక్సీ ఆవిష్కరిస్తున్న ఎంపీపీ మల్లికార్జునరెడ్డి, సర్పంచ్, ఈవోఆర్డీ



మోటుమాలలో పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న సర్పంచ్ గోపి

సమన్వయంతో పనిచేస్తేనే అభివృద్ధి

- కొత్తపట్నం ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి
- వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ప్రారంభం



సంక్షేమ పథకాల క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ అంజిరెడ్డి, అధికారులు

కొత్తపట్నం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేస్తేనే రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతాయని ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి అన్నారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని అల్లూరు, ఆలూరు రాజీవ్ కళామందిర్‌లో బుధవారం నిర్వహించారు. అల్లూరు, ఆలూరు సర్పంచ్‌లు నంబూరి సూర్యనారాయణ, పూనూరి మాధవి అధ్యక్షత వహించగా, ఎంపీపీ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతిఒక్కరికీ చేరే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రధాని మోదీ, సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సమన్వయంతో పనిచేయడం సంతోషకరమని కొనియాడారు. ప్రభుత్వ పథకాల అమలులో సచివాలయ సిబ్బంది, జిల్లా అధికారులు చురుగ్గా పాల్గొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు మంచి పేరు తీసుకురావాలని ఆదేశించారు. ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నుంచి ఎటువంటి పథకాలు వచ్చాయో వివరించారు. తమిళనాడు డిప్యూటీ జనరల్ మేనేజర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ డ్రోన్ వాడకంతో ఉపయోగాలను వివరించారు. ప్రకృతి వ్యవసాయ శాఖ ప్రాజెక్ట్ మేనేజర్ వి.సుభాషిణి మాట్లాడుతూ రసాయన ఎరువుల వాడకం తగ్గించి ప్రకృతిలో తయారు చేసే కషాయాలను వాడుకోవాలని సూచించారు. ఆయుష్మాన్ భారత్ టీం లీడర్ జాన్సీ మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులకు ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని వివరించారు. అనంతరం హైస్కూల్ విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆయుష్మాన్ భారత్ హెల్త్‌కార్డులు పంపిణీ చేశారు. సంక్షేమ పథకాల క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈవోఆర్డీ ఏ బాలచెన్నయ్య, వీరేపల్లి రామచంద్రారెడ్డి, గ్రామ సచివాలయ నోడల్ ఆఫీసర్ ఉషారాణి, బీజేపీ జిల్లా కన్వీనర్ యోగయ్య, తహసీల్దార్ బీవీ రమణారావు, ఎంపీటీసీ సభ్యుడు మిట్నసల శాంతారావు, ఎంఈవో పద్మావతి, చంద్రశేఖర్, రాంబాబు, ఏపీఎం రజియా సుల్తాన్‌బేగం, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వంశీకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న అంజిరెడ్డి, సుజాత, చంద్రశేఖర్

కొత్తపట్నం: జగనన్న లే అవుట్లలో గృహాలకు తాగునీరు నిమిత్తం ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణానికి బుధవారం భూమి పూజ చేశారు. ముఖ్య అతిథులుగా ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, తహసీల్దార్ బీవీ రమణారావు, ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ టి.చంద్రశేఖర్, ఏఈ వంశీకృష్ణారెడ్డి, ఎంపీటీసీలు చలంచర్ల తిరుపతమ్మ, రామలింగం వెంకట్రావు పాల్గొని టెంకాయలు కొట్టి పూజలు చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ జగనన్న లే అవుట్లలో 286 మందికి ఇళ్ల పట్టాలివ్వడం జరిగిందన్నారు. 168 గృహాలకు బేస్‌మట్టం పూర్తయిందని, 20 ఇళ్లు పూర్తయ్యాయని తెలిపారు. ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ప్రోత్సాహంతో జలజీవన్ మిషన్ ద్వారా రూ.67.63 లక్షలు మంజూరు చేయించినట్లు తెలిపారు. జగనన్న కాలనీలో 40 వేల లీటర్ల సామర్థ్యంతో ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మించేందుకు భూమి పూజ చేశామన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ అన్నం నాంచార్లరెడ్డి, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు బంకా శ్రీధర్, బీజేపీ మండల అధ్యక్షుడు నాదారు సుబ్రహ్మణ్యం, తులసి, గాలి ముసలారెడ్డి, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు విష్ణుప్రియ, మధుప్రియ, రాజగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలపై మెగా కంప్లీషన్ డ్రైవ్

- కలెక్టర్ దినేష్‌కుమార్



సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగంగా పూర్తయ్యేందుకు మెగా కంప్లీషన్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. నిర్దేశించిన లక్ష్యాన్ని చేరేలా వివిధ శాఖలు మరింత సమన్వయంతో పనిచేయాలన్నారు. దీనిపై బుధవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో సమీక్ష సమావేశం నిర్వహించారు. మెగా కంప్లీషన్ డ్రైవ్ లక్ష్యాలను కలెక్టర్ వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా మరో ఐదు లక్షల ఇళ్ల నిర్మాణాలను జనవరి నెలాఖరుకు పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించిందన్నారు. అందులో భాగంగా జిల్లాలో ఈ విడతలో 13,108 ఇళ్లు పూర్తి చేయాల్సి ఉందన్నారు. బేస్‌మట్టం పూర్తయి వివిధ స్థాయిలో నిర్మాణాలు ఉన్నాయన్నారు. వచ్చే రెండు మాసాల్లో వాటిని తప్పనిసరిగా పూర్తి చేయాలన్నారు. ఇటుకలు, కంకర, సెంట్రింగ్ సామగ్రి సరఫరాలో అంతరాయాలు లేకుండా చూడాలన్నారు. సామగ్రి సరఫరాలో కొంత మేర తక్కువ ధరకు సరఫరా చేయాలని సూచించారు. స్థానిక పరిస్థితుల ఆధారంగా ధరలను నిర్ణయించేందుకు డిసెంబర్ 1వ తేదీ ఎంపీడీఓలు, తహసీల్దార్లు ఇతర మండల స్థాయి అధికారులు ప్రత్యేక సమన్వయ సమావేశం నిర్వహించేలా చూడాలని ఆర్‌డీఓలను ఆదేశించారు. స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులు ఇళ్ల లబ్ధిదారులుగా ఉంటే వారికి అవసరమైన ఆర్థిక సహాయం వివిధ పథకాల కింద త్వరగా అందేలా చూడాలన్నారు. సమావేశంలో హౌసింగ్ పీడీ పేరయ్య, మార్కాపురం సబ్ కలెక్టర్ సేతుమాధవన్, డీఆర్‌డీఏ పీడీ రవికుమార్, జిల్లా పరిశ్రమల సంస్థ జనరల్ మేనేజర్ శ్రీనివాసరావు, గనుల శాఖ డీడీ జగన్నాథరావు, కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు, కనిగిరి ఆర్‌డీఓ జాన్ ఇర్విన్, హౌసింగ్ ఈఈలు, డీఆర్‌డీఏ ఏపీఎంలు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారులు తప్పుడు మెసేజ్‌లు నమ్మవద్దు

ఒంగోలు సబర్బన్: జిల్లాలోని విద్యుత్ వినియోగదారులు సైబర్ నేరగాళ్లు పంపే తప్పుడు మెసేజ్‌లు నమ్మవద్దని ఏపీసీపీడీసీఎల్ జిల్లా ఎస్ఈ కేవీజీ సత్యనారాయణ కోరారు. ఆ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. కొందరు సైబర్ నేరగాళ్లు తప్పుడు మెసేజ్‌లు పంపి మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ప్రజలు, విద్యుత్ వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఉద్యోగం చేసే ఊరిలోనే నివాసం ఉండాలి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డా.రాజ్యలక్ష్మి

ఒంగోలు టౌన్: పీహెచ్‌సీల్లో విధులు నిర్వహించే ఉద్యోగులు స్థానికంగా నివాసం ఉండాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్.రాజ్యలక్ష్మి స్పష్టం చేశారు. జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో బుధవారం మార్కాపురం పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు సంబంధించి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేసే సిబ్బంది అన్నీ రకాల రికార్డులను సక్రమంగా నిర్వహించాలని, ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు. ఓపీతో సహా అన్నీ రకాల రిజిస్టర్లను పూర్తి సమాచారంతో పూర్తి చేయాలని చెప్పారు. వైద్యారోగ్య శాఖ అమలు చేస్తున్న అన్నీ ఆరోగ్య కార్యక్రమాలను ప్రజలకు తెలిసేలా ప్రచారం నిర్వహించాలని, ఆశా, ఏఎన్ఎం, అంగన్‌వాడీ వర్కర్లతో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. శాశ్విత, తాత్కాలిక కుటుంబ నియంత్రణ పద్ధతుల, రక్తహీనత, ఫ్రైడే డ్రైడే, సేఫ్ డెలివరీ కాలెండర్, వైఎస్సార్ ఆరోగ్య శ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ సేవల గురించి ప్రజలకు తెలియజేయాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో ఉప వైద్యాధికారి డా.మాధవీలత, డా.వాణిశ్రీ, డా. పద్మజ, డీపీఎంఓ సుగుణమ్మ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబానికి బాలినేని భరోసా



సలాం భౌతిక కాయం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు: స్థానిక మూడో డివిజన్‌కు చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త సయ్యద్ సలాం అనారోగ్యంతో మరణించారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి బుధవారం వారింటికి చేరుకుని సలాం భౌతిక కాయానికి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. సలాం పార్టీకి అందించిన సేవలు తమకు తెలుసని, తప్పకుండా అండగా ఉంటానని అభయమిచ్చారు. బాలినేని వెంట వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ సయ్యద్ జలీల్, తదితరులు ఉన్నారు.

సీఎంను కలిసిన ఆరోగ్యశ్రీ రాష్ట్ర ప్రత్యేక అధికారి



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితో యాదల అశోక్‌బాబు

ఒంగోలు టౌన్: ఆరోగ్యశ్రీ రాష్ట్ర ప్రత్యేక అధికారి డాక్టర్ యాదల అశోక్‌బాబు బుధవారం తాడేపల్లిలోని క్యాంప్ ఆఫీసులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. డిసెంబర్ 1 నుంచి ఆరోగ్యశ్రీ సేవలపై రాష్ట్ర వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు ప్రారంభంకానున్న నేపథ్యంలో.. రాష్ట్రంలోని ప్రజలంతా సులభంగా, ఉచితంగా ఆరోగ్యశ్రీ సేవలు పొందేలా చూడాలని ముఖ్యమంత్రి సూచించినట్లు అశోక్‌బాబు తెలిపారు. ఆరోగ్యశ్రీ కార్యక్రమం గురించి ప్రజలకు వివరిస్తూ రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా పర్యటించడం, జగనన్న సురక్ష క్యాంపులను విజిట్ చేయడంపై సీఎం అభినందనలు తెలిపినట్లు వెల్లడించారు. నిరుపేద, మధ్యతరగతి ప్రజలు వైద్యం కోసం చేతి నుంచి డబ్బు ఖర్చు చేయకుండా ఉండేందుకు వారికి ఆరోగ్యశ్రీపై అవగాహన కల్పించేలా కృషి చేయాలని సీఎం సూచించారని అశోక్‌బాబు చెప్పారు.

హాస్టళ్లలో దోమల నివారణకు చర్యలు

మద్దిపాడు: మద్దిపాడులోని బీసీ, ఎస్సీ వసతి గృహాల్లో వైద్యారోగ్యశాఖ సిబ్బంది దోమల నివారణ చర్యలు చేపట్టారు. సూపర్‌వైజర్ ఆధ్వర్యంలో హాస్టల్‌లోని ప్రతి గదిలో దోమల నివారణకు ఐఎస్ఎస్ (ఇన్‌డోర్ స్పేస్ స్ప్రేయింగ్) చేశారు. చలికాలం నేపథ్యంలో దోమల ఉధృతి ఎక్కువగా ఉంటుందని, అందువలన ముందు నుంచే ఐఎస్ఎస్ చేయడం ద్వారా విద్యార్థులకు అసౌకర్యం లేకుండా ఉంటుందని వైద్యశాఖ సిబ్బంది తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, గదుల్లో తడి దుస్తులు ఆరవేయరాదని హాస్టల్ విద్యార్థులకు తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ బాలకోటయ్య వైద్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి సహకరించాలి

- ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి
- మండల పరిషత్ సమావేశానికి అధికారుల గైర్హాజరుపై ఆగ్రహం
- నోటీసులు ఇవ్వాలని తీర్మానం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి

మద్దిపాడు: మండల అభివృద్ధికి అధికారులు సహకారం అందించాలని ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి కోరారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి ఆయా శాఖల అధికారులు సహకరించాలన్నారు. ఆయా శాఖల పరంగా చేయాల్సిన కార్యక్రమాల గురించి వివరిస్తే మండలంలో తగు చర్యలు తీసుకుని అభివృద్ధి చేసే అవకాశం ఉంటుందన్నారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ప్రజలకు జవాబుదారులుగా ఉంటారని, వారికి సరైన సమాచారాన్ని ఆయా శాఖల అధికారులు తెలియజేయాలని కోరారు. మండలంలో వారి శాఖల పురోగతి గురించి పలువురు మండల స్థాయి అధికారులు నివేదికలు చదివారు. పశువైద్యశాఖ అధికారిణి డాక్టర్ మాధవి మాట్లాడుతూ తమ శాఖ తరఫున పశువులకు హెల్త్ కార్డులు ఇస్తున్నామని తెలిపారు. దీనిపై గ్రామస్తులకు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు అవగాహన కల్పించాలని కోరారు. వ్యవసాయశాఖ అధికారి కె.రమేష్ మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌లో శనగ విత్తనాలను ప్రతి గ్రామంలో ఇచ్చామని, ఇంకా అవసరమైన వారు తెలియజేయాలని కోరారు. విద్యాశాఖ అధికారి నాడు-నేడు కార్యక్రమం ద్వారా ఎన్ని స్కూళ్లలో పని జరిగిందనే విషయాన్ని వివరించారు. కొందరు సభ్యులు లేచి మండల తహసీల్దార్ కార్యక్రమానికి గైర్హాజరయ్యారని, అదే విధంగా గతంలో ఎన్ని మార్లు చెప్పినా విద్యుత్ శాఖ ఇన్‌చార్జి ఏఈ సర్వసభ్య సమావేశానికి హాజరు కావడం లేదని, ఎందుకు చర్యలు తీసుకోవడం లేదంటూ ప్రశ్నించారు. దీనిపై స్పందించిన ఎంపీపీ.. సర్వసభ్య సమావేశానికి హాజరుకాని అధికారులందరికీ నోటీసులు ఇవ్వాలని తీర్మానం రాయాలని ఏఓను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఏఓ సుబ్బారావు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పలువురు మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా కుప్పం ప్రసాద్ జన్మదిన వేడుకలు



కుప్పం ప్రసాద్‌ను సత్కరిస్తున్న ఆర్యవైశ్య సంఘ నాయకులు

ఒంగోలు: రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్ జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. స్థానిక వైశ్యభవన్‌లో ఆర్యవైశ్య జిల్లా సంఘం, యువజన సంఘం, ప్రకాశం జిల్లా వాసవీ సేవాదళ్, ఒంగోలు నగర ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో కుప్పం ప్రసాద్‌ను వెండి కిరీటంతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కుప్పం ప్రసాద్ మాట్లాడుతూ మనసున్న మంచి మనిషిగా పేరుపొందిన ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి సారథ్యంలో తాను రాజకీయాల్లోకి రావడం, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కావడం ఆనందంగా ఉందన్నారు. ఆర్యవైశ్యులు తనపై చూపిస్తున్న ప్రేమను ఎన్నడూ మరువనని, ఎవరికి ఏ అవసరం ఉన్నా తప్పకుండా తన వంతు సాయం చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ జిల్లా అధ్యక్షుడు రావూరి కాశీరంగ జనార్దన్, ప్రధాన కార్యదర్శి జలదంకి వెంకటకృష్ణారావు, కోశాధికారి కొత్తూరు రంగనాయకులు, ఆర్యవైశ్య యువజన సంఘ అధ్యక్షుడు కొణిజేటి సురేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి పులిపాటి హరీష్, కోశాధికారి పేర్ల మురళీకృష్ణ, వాసవీ సేవాదళ్ అధ్యక్షుడు చీదెళ్ల వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి కోళ్లపూడి బ్రహ్మయ్య, కోశాధికారి బాదం కళ్యాణ్, ఒంగోలు నగర అధ్యక్షుడు దేవతు రాజా, వాసవీ క్లబ్, ఆర్యవైశ్య సంఘం, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య యువజన సంఘ అధ్యక్షునిగా మట్టా శ్రీహర్ష, కోశాధికారిగా దుద్దు నరేష్‌కుమార్, కార్యదర్శిగా వేమూరి గణేష్, ఉపాధ్యక్షులుగా వేమూరి సాయి, అరవపల్లి సాయి సుమంత్‌ను నియమించగా, వీరంతా ఆర్యవైశ్య కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ కుప్పం ప్రసాద్ చేతులమీదుగా నియామక పత్రాలు అందుకున్నారు.